క్లుప్తంగా

జోనల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్డీఓ పాండు

జోగిపేట(అందోల్): అందోల్ గురుకుల పాఠశాల ఆవరణలో సోమవారం 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను అందోల్–జోగిపేట ఆర్డీఓ పాండు క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం గౌరవవందనం స్వీకరించారు. క్రీడల్లో అందోల్, బంట్వారం, చిట్కుల్, ఇస్నాపూర్, రాయికోడ్, ఆర్‌కేపురం, మోమిన్‌పేట్, వికారాబాద్, జహీరాబాద్, కోకట్ గురుకులాలకు చెందిన 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ క్రీడాకారులను అధికారులు పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పీడీ గణపతి, పీఈటీ మౌనికతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ జాతర



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ముబారక్ పూర్(బి) గ్రామంలో సోమవారం బంగారు మైసమ్మతల్లి జాతరను భక్తులు వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి సర్వే



సర్వే చేస్తున్న నిర్వాహకులు, నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని చెరువుల అభివృద్ధి పనులకు సోమవారం సర్వే చేపట్టారు. సాయిగణేష్ ఏజెన్సీ ఆధ్వర్యంలో కల్హేర్ కామునిచెరువు, మహదేవుపల్లి చెరువులను సర్వే చేశారు. ఏజెన్సీ ఇంజనీరింగ్ ఇన్‌చార్జి మాట్లాడుతూ.. చెరువుల అభివృద్ధి, కాల్వల సీసీ లైనింగ్, తదితర పనులు చేపట్టేందుకు సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, నాయకులు దేవదాస్, వెంకట్‌రెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగిరం చేయండి

ఆర్డీఓ అశోక్ చక్రవర్తి



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

కల్హేర్(నారాయణఖేడ్): ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలని నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక్ చక్రవర్తి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కృష్ణాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం సాయిలు, తుకరాం పాల్గొన్నారు.

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి



నివాళులర్పిస్తున్న అధికారులు

సంగారెడ్డి జోన్: కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతిని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సమీకృత కార్యాలయాల సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మజరాణి, అధికారులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. 11 ఏళ్ల పాటు విద్యాశాఖ మంత్రిగా పనిచేసి, విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ దేవజా, డీఈఓ వెంకటేశ్వర్లు, పిడి మెప్మాగీత, ఖాసీంబేగ్ పాల్గొన్నారు.

రూరల్ సీఐగా క్రాంతికుమార్

సంగారెడ్డి జోన్ : సంగారెడ్డి రూరల్ సీఐ అశోక్ కుమార్ బదిలీపై మల్టీజోన్ హైదరాబాద్‌కు వెళ్లాడు. రూరల్ సీఐగా హైదరాబాద్ మల్టీ జోన్ 2 నుంచి క్రాంతికుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. కొండాపూర్ సీఐగా వెంకటేశం ,ఇక్కడ పనిచేసిన చంద్రయ్యను మల్టీజోన్ 2కు పంపించారు. సీసీఎస్ సంగారెడ్డికి శివకుమార్ బాధ్యతలు స్వీకరిస్తారని ఎస్పీ తెలిపారు.

నిబంధనలు బేఖాతర్

- ద్విచక్ర వాహనదారుల నిర్లక్ష్యం
- కేసులు నమోదు చేసినా కనిపించని మార్పు



వాహనాదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్ : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు తలకు గాయాలు కాకుండా కాపాడుతుందని తెలిసినా పట్టించుకోవడం లేదు. చలాన్ల నుంచి తప్పించుకోవడానికి వాహన నంబర్లను ట్యాంపరింగ్ చేస్తున్నారు. కేసులు నమోదవుతున్నాయని తెలిసినా, తనిఖీ చేసిన సమయంలో చూసుకోవచ్చని పట్టించుకోవడం లేదు.

నంబర్ ట్యాంపరింగ్‌తో..

మార్కెట్‌లోకి కొత్త వాహనాలు రాగానే వేలాది రూపాయలు వెచ్చించి, కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్న యువత కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. నంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు వేయడం, అక్షరాలు కనిపించకుండా పైకి మలపడం, మాస్కులు కట్టడం మధ్యలో నంబర్ తప్పించడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారు.

ఇలా చేయడం వల్ల...

నంబర్ ట్యాంపరింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు నష్టపోయేది వాహనదారులే, వాహనం ఎవరిది.. ప్రమాదం ఎవరు చేశారో తెలియదు. బాధితుడికి బీమా రాకుండా పోయే అవకాశం ఉంది. ప్రమాద సమయంలో మన తప్పు లేకున్నా.. అవతలి వాహనదారుడి తప్పు ఉన్నా నంబర్ ప్లేట్ సరిగా లేకుంటే న్యాయం జరిగే అవకాశం ఉండదు. చాలా మంది వాహనాదారులు పోలీస్ చలాన్ల నుంచి తప్పించుకునే విషయంలో ఇతర వాహనాల నంబర్లతో తిరుగుతున్నారు. పోలీసులు తనిఖీల్లో పట్టుబడుతూ కేసులు ఎదుర్కొంటున్నారు.

ఇవి తప్పనిసరి...

వాహనదారుడు వద్ద లైసెన్స్, ఆర్‌సీ, బీమా, కాలుష్య నియంత్రణ పత్రాలు వెంట ఉండాలి. లైసెన్స్ లేకుండా వాహనం నడిపి ప్రమాదం జరిగినప్పుడు శిక్ష ఎక్కువగా పడే అవకాశం ఉంటుంది. వాహనానికి బీమా ఉంటే ప్రమాదం జరిగినప్పుడు వాహనంతో పాటు బాధితుడికి కూడా వర్తిస్తుంది.

పటాన్‌చెరు టాప్..

వాహనాల నంబర్ ట్యాంపరింగ్ దర్జాగా తిరుగుతున్న వారిని పోలీసులు గుర్తిస్తున్నారు. వాహనం స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేస్తున్నారు. ఇటీవల ఇలాంటి కేసులు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు 33, 308 హెల్మెట్ ధరించని కేసులు, నంబర్ ప్లేట్ వినియోగించని 2414 కేసులు, డ్రైవింగ్ లైసెన్స్ లేని 3,856 కేసులను ట్రాఫిక్ పోలీసులు నమోదు చేశారు.

నిబంధనలు పాటించాలి



వాహనదారులు నిబంధనలు పాటించాలి. ఇతర వాహనాల నంబర్లను వినియోగించుకోవడం, నంబర్లను తొలగించడం సరైన పద్ధతి కాదు. నంబర్ ప్లేట్ వినియోగించని వాహనాలపై కేసులు నమోదు చేశాం. చాలా వరకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం లేదు. హెల్మెట్ ధరించాలని, నిబంధనలు పాటించాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–ట్రాఫిక్ సీఐ లాలూనాయక్

విద్యతో పాటు క్రీడలూ ముఖ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని జూకల్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం 6వ చార్మినార్ జోన్ పరిధిలోని 11 గురుకులాల బాలురకు 10వ జోనల్ 2024–25 స్పోర్ట్ మీట్‌ను ఆయన క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. విద్యార్థుల ప్లాగ్‌మార్చ్‌ను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు, క్రీడలను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తోందన్నారు. ఖేడ్‌కు సమీకృత గురుకులం, స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రం మంజూరయ్యాయి. వచ్చే ఏడాదిలోగా ఐటీఐ, పీజీ కళాశాల, ఇండోర్, ఔట్‌డోర్ గ్రౌండ్‌లు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. విద్యార్థులు సొంతంగా చిత్రీకరించిన గౌతమబుద్ధుడి ప్రతిమను జ్ఞాపికగా ఎమ్మెల్యేకు బహూకరించారు. కార్యక్రమంలో క్రీడల రాష్ట్ర సమన్వయకర్త లాలునాయక్, ఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ శంకర్, ప్రిన్సిపాల్ లింగారెడ్డి, శంకర్ ముదిరాజ్, రమేష్ చౌహాన్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వల్లే ఎస్‌ఏపీ అస్తవ్యస్తం

నారాయణఖేడ్: గత బీఆర్‌ఎస్ పాలకుల నిర్లక్ష్యం వల్ల ఎస్ఏపీ పథకం అస్తవ్యస్తంగా మారిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. మనూరు మండలంలోని బోరంచ ఎస్ఏపీ నీటి సరఫరా పథకం, పంప్‌హౌస్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ పథకం ద్వారా బోరంచ గ్రామానికి నీటి సరఫరా జరిగేది. గత నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరించి మూత వేశారని మండిపడ్డారు. తిరిగి పునరుద్ధరించి నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూస్తానని చెప్పారు.

కులగణన సర్వే గడువు పొడిగించాలి

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య

జోగిపేట(అందోల్): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన సర్వే చేయడంలో ఎన్యుమరేటర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున నిర్ణీత సమయంలో పూర్తయ్యే అవకాశం లేనందున గడువును పొడిగించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.మాణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ప్రభు, జిల్లా గౌరవాధ్యక్షుడు తులసీరాం రాథోడ్‌లతో కలిసి ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక్కొక్క కుటుంబానికి 75 అంశాలతో కూడిన ప్రశ్నావళికి సమాచారం సేకరించడానికి 45 నిమిషాలకు పైగా సమయం పడుతుందన్నారు. సరైన ప్రచారం లేని కారణంగా కుటుంబాల యజమానులు ఇళ్లలో అందుబాటులో ఉండడం లేదని, ఉన్నా కూడా సరిగ్గా స్పందించడం లేదన్నారు. ఎన్యుమరేటర్ల సంఖ్యను పెంచి, ఇళ్ల సంఖ్యను తగ్గించాలని కోరారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ మండలంలో సోమవారం రాత్రి సదర్ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గొల్ల, కుర్మ, యాదవ సంఘం నాయకులు దత్తుయాదవ్, పాండు యాదవ్‌ల ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా నిర్వహించిన సదర్ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నాయకులు భాస్కర్, శివాజీ పాటిల్, ఓంకార్, మల్లేష్, సతీష్‌కుమార్ తదితరులు దున్నపోతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సౌండ్ బాక్స్‌ల పాటల మధ్య యువకులు డ్యాన్స్‌లతో సందడి చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, జగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవంలో సెట్విన్ చైర్మన్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని గడి ప్రాంతంలో గొల్ల కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గరిధిర్‌రెడ్డి పాల్గొన్నారు. దున్నపోతుల విన్యాసాలు తిలకించారు. ఈ సందర్భంగా ఆయన యాదవులకు సదర్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



దీపాల కాంతులతో లింగాకారం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయం సందడిగా మారింది. పలువురు జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అభిషేకాలు, కుంకుమార్చన పూజలు, అమ్మవారి సన్నిధిలో సహస్రార్చన పూజలు అర్చకులు చేశారు. హరహర మహాదేవ అంటూ ధ్వజస్తంభం ఎదుట భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తుల కోసం ఆలయ ఈఓ శశిధర్ గుప్తా, పర్యవేక్షకుడు సోమయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో గుమ్మడిదల ఎంపీడీఓ ఉమాదేవి, జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష దీపారాధన

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి కార్తీకమాస లక్ష దీపారాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభంపై ఆకాశ దీపాలను వెలిగించారు. శివఅష్టోత్తర శతనామావళి, లింగాష్టకం, గాయత్రి మహామంత్రం, మృత్యుంజయ మహామంత్రం, హనుమాన్ చాలిసా పారాయణం పఠించారు. అనంతరం కార్తీక దీపాలను వెలిగించి హారతి చేశారు. ఆలయ ప్రధాన పూజారి సంగమేశ్వరస్వామి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమయానికి బస్సులు నడపాలని ధర్నా



రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

జోగిపేట(అందోల్): కళాశాలకు వెళ్లే సమయంలో ఆర్టీసీ బస్సులు నడపాలని ఆయా గ్రామాల విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం జోగిపేట బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. బస్సులు ఉదయం, సాయంత్రం సమయాల్లో నడపాలంటూ నినాదాలు చేశారు. ప్రధాన రహదారిపై బైఠాయించడంతో ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి రజనీకాంత్ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ డిపో నుంచి జగిర్యాల మీదుగా జోగిపేటకు ఆర్టీసీ బస్సులు ఉదయం, సాయంత్రం వేళల్లో నడపాలని గత కొన్ని నెలలుగా నారాయణఖేడ్ డిపో మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. బస్సులు లేకపోవడంతో విద్యార్థులు సమయానికి కళాశాలలకు రాలేకపోతున్నారని, సాయంత్రం పూట ఇంటికి చేరుకునే సరికి చీకటి పడుతుందన్నారు. డిపో మేనేజర్ స్పందించి విద్యార్థుల కోసం బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ విద్యార్థులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపచేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మధుసూదన్, సాయికిరణ్, మహేశ్, అజయ్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ఆందోళన



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

జహీరాబాద్: నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని పారిశుద్ధ్య కార్మికులు సోమవారం మండల కేంద్రం కోహీర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై మాసం నుంచి ఇప్పటివరకు నాలుగు నెలల వేతనాలు ఇవ్వలేదని వాపోయారు. మురికి కాల్వలు, వీధులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాల పరిస్థితి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కోహీర్ మేజర్ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న 23 మందికి చెల్లించాల్సిన నాలుగు నెలల వేతనం రూ.9.20 లక్షలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధికంగా సమ్మెలో కొనసాగుతామని వారు లిఖితపూర్వకంగా మండల పంచాయతీ అధికారికి రాసిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మణ్‌రావు, ప్రమోద్, సంజీవ్, శీను, నర్సింలు, ఘనీమియ, ముజఫర్, రవికాంత్, యాదమ్మ, పోచమ్మ, బాలమణి సంతోషమ్మ, లక్ష్మి, రత్నమ్మ, దశరథ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా కుటుంబ సర్వే నిర్వహణ

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కల్హేర్(నారాయణఖేడ్): సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేయాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఎన్యుమరేటర్లకు సూచించారు. సోమవారం సిర్గాపూర్ మండలం వండ్లల్‌లో సమగ్ర సర్వేను పరిశీలించారు. ఇంటికి వచ్చే సిబ్బందికి పూర్తి సమాచారం ఇచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. సర్వే తీరు గురించి గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, సూపర్‌వైజర్లు, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

పసుపు పంటపై విద్యార్థుల అధ్యయనం



పసుపు పంటను పరిశీలిస్తున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: మల్లారెడ్డి యూనివర్శిటీ బీఎస్సీ హార్టికల్చర్ విద్యార్థులు సోమవారం రంజోల్‌లో రైతులు సాగు చేస్తున్న పసుపు పంటపై అధ్యయనం చేశారు. గ్రామీణ ఖుషీ అనుభవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మూడు నెలల పాటు గ్రామాల్లో ఉంటూ గ్రామీణ స్థితిగతులు, రైతులు సాగులో అనుసరిస్తున్న పద్ధతులు, నూతన సాగు విధానం, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలను అధ్యయనం చేస్తున్నారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రదీప్ కుమార్, విద్యార్థులు ప్రీతి, పూజిత, ప్రైసీ, వైష్ణవి, స్నేహిత, అలేఖ్యలు పాల్గొన్నారు.

వేతనాలు పెంచకుంటే విధులు బహిష్కరిస్తాం



జహీరాబాద్ టౌన్: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచకుంటే విధులను బహిష్కరిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపైన చర్యలు తీసుకోవాలన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఒకే రకమైన పనులు చేస్తున్న వారి మధ్య వేతన వ్యత్యాసం ఉండరాదని, కాంట్రాక్టు కార్మికుడికి సైతం పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా.. పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు దశరథ్, రాజు, జయరాం , సువర్ణ, వెంకటేష్ సంగమేశ్వర్, రాము, కుర్షిద్ భాయ్, వేణు పాల్గొన్నారు.

పీఎఫ్ డబ్బులు జమ చేయాలి

జహీరాబాద్ టౌన్: పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు జమ చేయాలని కాంట్రాక్టు కార్మికులు సోమవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ నాయకులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ.. పెండింగ్ పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కార్మికుల అకౌంట్‌లో జమచేయాలన్నారు. కొన్ని నెలలుగా అడుగుతున్న మున్సిపల్ అధికారులు స్పందించడం లేదన్నారు. అలాగే, పీఎఫ్ విత్‌డ్రా సమస్య ఉందని వాపోయారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఇందిరాక్రాంతి పథకంలో పని చేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐకెపి వీవోఏల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం మోర్గి గ్రామానికి చెందిన బస్వరాజ్‌స్వామికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సిఫార్సుతో సీఎం సహాయనిధి చె క్కు మంజూరయింది. సోమవారం ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి చెక్కు ను అందజేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నాయకులు రాజు, ప్రభాకర్‌రెడ్డి, సంజీవ్ పాటి ల్, అర్జున్, తుకారాం, సంగ్రాం పాల్గొన్నారు.

◆ **అపూర్వ సమ్మేళనం**



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం, రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006–2007 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చిన్ననాటి స్నేహితులతో గడిపిన కాలాన్ని ఎప్పటికీ మర్చిపోలేరని అన్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, విష్ణువర్ధన్ రెడ్డి, కరుణాకర్, రుక్మిణి, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనులు చేపడుతున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈఈ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలో మహీంద్ర పరిశ్రమ వద్ద గల 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నామన్నారు. రాయికోడ్, న్యాల్‌కల్, ఝరాసంగం, జహీరాబాద్ మండలాల్లో ఉ.9 గంటల నుంచి 10.30 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. పట్టణంలో విద్యుత్ సరఫరాలకు ఎలాంటి ఆటంకం ఉందని చెప్పారు.

◆ **మందుబాబులకు జరిమానా**

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలో టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద, సంగారెడ్డి పాత బస్టాండ్ వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 12 మంది వాహనదారులు మద్యం సేవించి పట్టుపడ్డారు. వారిని సంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపరచగా జిల్లా జడ్జి వారికి రూ. 2000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ **25 మందికి..**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 25 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ **ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం**

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ విభాగాలు, సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె ఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం ఆజాద్ భారతదేశంలో విద్యారంగ అభివృద్ధికి పునాదులు వేసి విద్యారంగం వేగంగా అభివృద్ధి చెందడానికి ఎంతో కృషి చేశాడన్నారు. నిరక్షరాస్యతను నిర్మూలించడానికి విద్యారంగంలో మార్పులను తీసుకుని రావడమే కాక మహిళల విద్యను ప్రోత్సహించడానికి అనేక సంస్థలను స్థాపనకు కృషి చేశాడని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ అధికారులు, డాక్టర్ సదయ కుమార్ ,డాక్టర్ సుమతి దేవి, డాక్టర్ వాణి, చరిత్ర అధ్యాపకులు బృందం పాల్గొన్నారు.


◆ **జాతీయస్థాయికి పోటీలకు ఎంపిక**

హత్నూర (సంగారెడ్డి): చదువుతో పాటు క్రీడల్లో రాణించి మార్షల్ ఆర్ట్స్ ఉష్షు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని సిరిపురం గ్రామ మాజీ సర్పంచ్ నరేందర్ అన్నారు. సోమవారం హత్నూర మండలం సిరిపురం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి చదువుతున్న ఎం.హరిప్రసాద్, ఎనిమిదో తరగతికి విద్యార్థి నాగేశ్వరి జాతీయస్థాయి ఉష్షు పోటీలకు ఎంపిక కావడంతో శాలువాతో ఘనంగా సన్మానించారు.

◆ **కొనసాగుతున్న సర్వే**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. సోమవారం ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి సర్వేను నిర్వహించారు. రాంతీర్థ్ గ్రామంలో కొనసాగుతున్న సర్వే తీరును మండల ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి పరిశీలించారు.

మున్సిపాలిటీగా మార్చొద్దు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం, గడ్డపోతారం గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చొద్దని గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీగా ఉంటేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీగా మారిస్తే ఇబ్బందులు వస్తాయని వాపోయారు. మున్సిపాలిటీగా మారిస్తే ఇప్పుడున్న పరిస్థితులు మారుతాయన్నారు. అన్ని టాక్స్‌లు పెరుగుతాయని అన్నారు. పేదల జీవన స్థితిగతులపై ప్రభావం చూపుతాయని వాపోయారు. కార్యక్రమంలో గడ్డపోతారం గ్రామస్తులు శ్రీనివాస్, బాలయ్య పాల్గొన్నారు.